
ఓలేటి శ్రీనివాసభాను



గార్డు గౌరీ శంకరానికి నచ్చనివి చాలా ఉన్నాయి. కర్ణాటక–గోవా సరిహద్దు రేఖలోని 'క్యాజిల్‌రాక్' స్టేషన్‌లో గూడ్సు గార్డు ఉద్యోగం....మూణ్నెలల పాటు ముసురుపెట్టి ఉసూరుమనిపించే వాతావరణం అతనికి నచ్చలేదు. డ్యూటీ దిగి, వంట చేసుకుని, ఉతికిన బట్టల్ని రాక్షసి బొగ్గు రాజుకున్న పొయ్యి దగ్గర ఆరబెట్టేలోగా డ్యూటీకి పిలుపు రావడం అతనికి నచ్చలేదు. కాబోయే భార్యకి ఉత్తరం రాస్తూ కంటి నిండా కలలు కందామంటే కాసేపైనా 'బ్రేక్' దొరకని బ్రేక్‌వ్యాన్ బతుకు అతనికి నచ్చలేదు.

# మత్స్యగంధి


ఇన్ని తలనొప్పుల మధ్య. ఆరోజు తెల్లవారగట్ల చీకట్లో, చినుకుల్లో వయసొచ్చిన అమ్మాయి తన బ్రేక్ వ్యాన్‌లో ఎదురెదురుగా కూర్చొని, నెత్తిమీద చుట్టంలాగా ఊరేగడం, గౌరీశంకరానికి నచ్చలేదు గాక నచ్చలేదు. ఆరోజు తెల్లవారు జామున నాలుగ్గంటలప్పుడు క్యాజల్‌రాక్ యార్డులోని లైన్ నెంబర్ సిక్స్‌లో గౌరీశంకరం తను పనిచేయాల్సిన బండి తాలూకు ఛార్జీ తీసుకోకముందే ఆ అమ్మాయి చీకట్లో వచ్చేసి, బ్రేక్ వ్యాన్‌లో తిష్ఠ వేసింది. గమ్‌బూట్లూ, రెయిన్ కోటూ, టార్చీ, బ్యాగు, గొడుగూ, పాదాల్లోతు నీళ్లల్లో 'తపాతపా' నడుస్తూ బ్రేక్‌వ్యాన్ ఎక్కిన గౌరీశంకరం చీకట్లో ఆకారాన్ని చూసి తుళ్లిపడ్డాడు. ''కౌన్ రే'' అంటూ హిందీలోనూ, ''యారప్పా'' అంటూ కన్నడంలోనూ గర్జించాడు. అలా గద్దిస్తూ, పొడుగాటి టార్చ్ మీట నొక్కాడు. చంద్రబింబాన్ని తెంపి బ్రేక్ వ్యాన్‌లో వేలాడదీసినట్లు గుండ్రని కాంతిపుంజం ఆ అమ్మాయి మొహమ్మీద పడింది. చంద్రకాంతిలో కలువరేకుల్లా ఆమె కళ్లు అద్భుతంగా మెరిశాయి.

చేపలమ్మాయి! చూస్తూనే పోల్చుకున్నాడు గౌరీశంకరం.

క్యాజల్‌రాక్ స్టేషన్‌యార్డ్ దాటుకుని, బొగ్గుల గుట్టలకీ, మాంగనీసు కుప్పలకీ మధ్య మెలికలు తిరిగే తోవలొంచి మెట్లు దిగి బజారు వీధిలోకి అడుగుపెట్టగానే ఎడమ వైపు కొంకిణి వాళ్ల చేపల దుకాణంలో కనిపిస్తుందా అమ్మాయి. చూసిన కొద్దీ చూడబుద్ధేసే అందం...అది చేపల్లాంటి అమ్మాయి కళ్లల్లో ఉంది. దారంట వెళ్లేవారు వాటిని ఓసారి పలకరించిన ట్లవుతుందని అక్కడ చేపల్ని కొంటారు. ఆ అమ్మాయి– వయసు వచ్చిన అందంతో పాటూ, వయసురాక ముందునుంచీ ఉన్న అందం వల్ల రెట్టించిన అందంతో మెరిసిపోతూ ఉంటుంది. అచ్చం తల్లి పోలిక. వయసులో ఉన్నప్పుడు వాళ్లమ్మ కూడా అలాగే ఉండేది. పోర్చుగీసువాళ్లు తెగ వెంటబడేవాళ్లు అంటూ సీనియర్ గార్డులు సిన్సియర్‌గా నిట్టూర్చేవారు.

చేపలమ్మాయి తల్లి ప్రతిరోజూ తెల్లవారగట్ల మూడు గంటలకి గోవా వెళ్లే లింక్ ఎక్స్‌ప్రెస్‌లో క్యాజల్‌రాక్ నుంచి మడ్‌గామ్ వెళుతుంది. అక్కణ్నించి చేపల బుట్టల్ని తీసుకొని పన్నెండు గంటల ప్యాసింజరులో క్యాజిల్‌రాక్‌కి తిరిగొస్తుంది. బుట్టల్ని దించి, ఇంటికి తీసుకెళ్లడానికి చేపలమ్మాయి ప్లాట్‌ఫారం మీదికి వస్తుంది. 'అంబరిల్లా కట్' ఉన్న బిగువైన పువ్వుల గౌను, పాదాలకి పాయల్ బ్రాండ్ గోవా స్లిప్పర్స్, గంపని తలకెత్తుకుని నడిచే







టప్పుడు చేపల బరువుతో పాటు అందాల బరువుతో, ఆగే ముందు ఊగే బొంగరంలాంటి నడుము-ప్లాట్‌ఫారం మొత్తం స్పెల్ బౌండ్! అమ్మాయి కళ్లను చూడాలో, అల్లాడే నడుమును చూడాలో, ఆచ్ఛాదన లేని మోకాళ్లను చూడాలో ఎంచుకోలేక-ఒడ్డునపడ్డ చేపల్లాగా విలవిల్లాడతారు.

అలాంటి అందం తన బ్రేక్ వ్యాన్‌లో...!? గౌరీశంకర్ మొదట ఆశ్చర్యపోయాడు. తరువాత మండిపడ్డాడు. కొంకిణీలో కసురుదామనుకొంటే 'కాయ్‌మారే...కిత్తేమారే' అనడం తప్ప మూడో ముక్క అతనికి రాదు. హిందీలో కన్నడంలో కష్టపడి వాక్యాన్ని నిర్మిస్తే చేపలమ్మాయికి అర్థమవుతుందో లేదో తెలీదు. అంతలో గూడ్సు బండికి సిగ్నల్ ఇచ్చారు. 'ఇక బయల్దేరుదామా?' అంటూ ఇంజన్ నుంచి డ్రైవర్ విజిల్ కోడ్‌లో అడిగాడు.

''ఊహూ... ముందీ అమ్మాయి దిగిపోవాలి... అప్పటి దాకా బండి కదల్దు'' అనుకున్నాడు గౌరీశంకరం. అంతలో 'మిస్టర్ గౌరీశంకరం' అంటూ డ్యూటీలో ఉన్న ఏఎస్ఎమ్ నాయర్ పరుగెత్తుకొని వచ్చాడు. అలా వస్తూనే గౌరీశంకర్ వేసిన టార్చ్ వెలుగులో చేపలమ్మాయిని చూశాడు. రెప్పవేయకుండా ఉండిపోయాడు. ఇంతలో డ్రైవర్ మళ్లీ విజిల్ వేశాడు. ''వాట్ ఈజ్ దట్ యూ ఆర్ లుకింగ్ ఫర్?'' గౌరీశంకరాన్ని తొందర పెడుతూ అతని చెవిలో ఏదో ఊదాడు నాయర్. గౌరీశంకరం అదోలా మొహం పెడితే మెడ మీద గిల్లి, నాలుక మడత పెట్టి వింత చప్పుడు చేశాడు. అది గౌరీశంకరానికి ఎబ్బెట్టుగా అనిపించింది. నాయర్ ఆలస్యం చేయలేదు. గౌరీశంకరం చేతిలోని హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్‌ని గుంజుకొని.... గ్రీన్ గ్లాస్‌లోకి తిప్పి, డ్రైవర్ వైపు చూపిస్తూ గాల్లో ఊపాడు.

''సీ... మిస్టర్ నాయర్....'' గౌరీశంకరం ఏదో అనేలోగా మాంగనీస్ ఖనిజాన్ని మార్మగోవా హార్బర్‌కి రవాణా చెయ్యడానికి బండి కదిలింది. వర్షం పుంజుకుంది. బ్రేక్ వ్యాన్‌లోకి చిరుగాలితో పాటు వానజల్లూ చొరబడింది. క్యాజిల్‌రాక్ యార్డూ, క్యాబినూ దాటిన తరువాత బ్రేక్‌వ్యాన్ గూడులోకి వచ్చాడు గౌరీశంకరం. తన ఎదురుగా చేపలమ్మాయి కదలని దీపశిఖలా కూర్చుంది. అవునూ.. రోజూ ఉదయం మూడుగంటల లింక్ ఎక్స్‌ప్రెస్‌లో వీళ్లమ్మ మడ్‌గామ్ వెళుతుంది కదా! ఇవాళ అమ్మ బదులు అమ్మాయి వెళ్తోందేంటీ? డ్యూటీలు మార్చుకొన్నారు కాబోలు! మార్చితే మార్చుకున్నారు. ఈ అమ్మాయి లింక్ ఎక్స్‌ప్రెస్‌లో పోకుండా తన చంక ఎక్కిందేవిటి? బహుశా మిస్సయిపోయిందేమో! గౌరీశంకరంలో ప్రశ్నలూ-సమాధానాలూ...

టన్నెల్ నెంబర్ వన్... ఎలకల కోసం కలుగులోకి దూరిన పాములాగా గుహలోకి దూరింది గూడ్సుబండి. పల్లం వైపు సాగుతున్న వ్యాగన్ల చక్రాలు-తడిపట్టాల మీద స్కిడ్ అవుతున్నాయి. ఆగి ఆగి వెళుతోంది బండి. టన్నెల్‌లో పెట్రోలు విజిల్ వేశాడు. దీపాల్ని పైకెత్తి చూపించాడు. ఇంజన్ రొద, బొగ్గు పొగ, ఎగ్జాస్ట్ పైప్సులోంచి ఆవిరి, టన్నెల్ గోడల్లో ఊడల్లా దిగుతున్న నీటి ఊటలు...ఏదోలా ఉంది వాతావరణం. గౌరీశంకరం కోటు మీద ఏదో పురుగు పాకింది. మెడ మీద కుట్టింది. ఏఎస్ఎమ్ నాయర్ తన మెడ మీద గిల్లిన సంగతి గౌరీశంకరానికి గుర్తొచ్చింది.

''తల్లీ కూతుళ్లకి చేపలమ్ముకొంటే గానీ బతుకు గడవదు. మీరిప్పుడు మడ్‌గామ్ దాకా ఈ అమ్మాయిని తీసుకువెళ్తే ఆ కుటుంబానికింత కూడు పెట్టినట్లవుతుంది. ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ మిస్సయితే వీళ్లు గూడ్సు ట్రెయిన్‌లో ఇలా వెళ్లడం మామూలే! రూల్సు జోలికి వెళ్లకండి...... మీ ఋణం ఉంచుకోదులెండి'' అంటూ నాలుక మడత పెట్టి నాయర్ చేసిన వింత చప్పుడు-గౌరీశంకర్ చెవిలో జోరీగలాగా రొదపెట్టింది....'భ్రమర కీటక న్యాయం' మనసును వశపరుచుకొంటోంది.

గూడ్సుబండి టన్నెల్‌లోంచి బయటకొచ్చింది. ఘాట్ సెక్షన్‌లో పిడుగు పడింది. అదిరిపడిన అడవిదున్నల మంద పట్టాలకు అడ్డంగా పరుగు తీసింది. డ్రైవర్ అదే పనిగా విజిల్ వేస్తూ, పల్లం దిశగా వేగాన్ని పుంజుకొంటున్న చక్రాల్ని వాక్యూం బ్రేక్‌తో నియంత్రిస్తున్నాడు. ఉక్కు కడ్డీల్లా వేలాడుతూ వర్షపు ధారలు... చేపలమ్మాయి కూర్చొన్న వైపు బ్రేక్ వ్యాన్ నిండా చిల్లులు.... వాటిలోంచి గాలి ఆమె మెడను తాకి వెన్నుపూసలోకి సూదుల తరంగాలై ప్రవహిస్తోంది.... వాన నీట్లో తడుస్తున్న ఆమె బాబ్డ్ హెయిర్ స్పాంజ్‌లాగా బరువెక్కుతోంది. అదేపనిగా వణికిపోవడంతో పక్కటెముకలు 'కరేల్'మన్నాయి. కండరాలు పట్టేశాయి. గొంగళీ పురుగు పాకిన తమలపాకు తీగెలాగా చేపలమ్మాయి అల్లాడిపోయింది. ఉబ్బెత్తుగా ఉన్న వక్షస్థలమ్మీద రెండు చేతుల్నీ కప్పుకొని చలి నుంచి కాపాడుకొనే ప్రయత్నంలో గబుక్కున లేచింది. ఘాట్ సెక్షన్‌లో బండి వెళ్తున్నప్పుడు బ్రేక్‌వ్యాన్‌లో నిలబడ్డమే ఓ సర్కస్ ఫీట్! పునాదులు కదుల్తున్న గోడలాగా ఉంటుంది పరిస్థితి. నిలబడ్డ తరువాత నిలకడగా ఉండే ప్రయత్నంలో చేపలమ్మాయి తూలిపడింది. హ్యాండ్ సిగ్నల్ లాంప్ వెలుగులో 'గార్డ్స్ జర్నల్'లో బండి వివరాలు, టైమింగ్సూ రాసుకొంటున్న గౌరీశంకరం తుళ్లిపడ్డాడు. ఆమె రెండు చేతులూ అతని భుజాల మీద వేలాడాయి. ఆమె ఊపిరి అతని చెంప మీద వెచ్చగా తాకింది. 'మీ ఋణం ఉంచుకోదులెండి' తన మెడ మీద గిల్లుతూ నాయర్ చెప్పిన మాటలు గౌరీశంకరానికి గుర్తొచ్చాయి. అతను తేరుకొనేలోగా చేపలమ్మాయి కంగారుగా లేచి నిలబడింది. వేగం మందగించిన బండి... ఓ చోట ఆగింది. అక్కడ స్టేషన్ లేదు. కానీ దాదాపుగా గూడ్సు బళ్లన్నీ అక్కడ ఆగుతాయి. ఆ సంగతి గౌరీశంకరానికి తెలుసు. చేపలమ్మాయికీ తెలుసేమో.... చలినీ, వర్షాన్నీ లెక్కచెయ్యకుండా బ్రేక్‌వ్యాన్‌లోని గూడులోంచి, టాపులేని ముందు భాగంలోకి వచ్చి, కుడివైపుకి తిరిగి, రెండు చేతులూ జోడించి దండం పెట్టింది. కళ్లు మూసుకొని ప్రార్థించింది. అక్కడ కొండరాయిని ఆనుకొని గాజు తలుపులతో పెద్ద గూడు... అందులో బాలేసుని ఎత్తుకొన్న మేరీమాత విగ్రహం... చుట్టూ కొవ్వొత్తులు... కొన్ని వెలుగుతూ,.. మరికొన్ని వెలిగిన్చటి జ్ఞాపకాల్ని బల్లపరుపుగా గుర్తుచేసుకొంటూ.. ఫైర్‌మెన్ సుభాష్ కామత్ ఇంజన్‌లోంచి దిగాడు. గాజు తలుపుల్ని తెరిచి, ఆ గూడులో కొవ్వొత్తి వెలిగించి దండం పెట్టాడు.

కళ్లు మూసుకొని చేతులు జోడించిన చేపలమ్మాయిని చూడగానే గౌరీశంకరం మనసులో సంఘర్షణ చల్లారింది. తెరిచిన ఆమె కళ్లలో కొవ్వొత్తుల వెలుగులు ప్రశాంతంగా ప్రతిబింబించాయి. గూడ్సు బండి బయలుదేరింది. కొన్ని గంటల తరువాత మడ్‌గామ్ చేరి, వాటరింగ్ కోసం ఆగింది. అక్కడ చేపలమ్మాయి గౌరీశంకరానికి కళ్లతోనే కృతజ్ఞతలు చెబుతూ కంగారుగా వెళ్లిపోయింది.

కొన్ని వారాల తరువాత..... ఓ రోజు క్యాజిల్ రాక్ బజారు వీధిలోంచి గౌరీశంకరం వెళ్తున్నాడు. ''సార్... గార్డు గారూ'' అంటూ ఓ స్త్రీ గొంతు వినిపించింది. తెలుగులో పిలుస్తున్నదెవరో అని ఆశ్చర్యపోతూ తిరిగి చూశాడు గౌరీశంకరం. కొంకిణీ వాళ్ల ఇంటి కిటికీలోంచి చేపలమ్మాయి తల్లి పిలుస్తోంది. వెంటనే ఆ ఇంటి తలుపు తెరుచుకుంది. ఎదురుగా చేపలమ్మాయి... చేపల్లాంటి కళ్లతో నవ్వుతూ గౌరీశంకరానికి నమస్కరించింది. అమ్మాయి తల్లి మెల్లగా వీధిలోకి వచ్చి,

''మీ ఉపకారాన్ని మరిచిపోలేను సారూ'' అంటూ గౌరీశంకరం చేతులు పట్టుకొంది.

గత నెలలో ఓ రోజు చేపలు తీసుకురావడానికి అమ్మాయి తల్లి ఎప్పటిలాగే మడ్‌గామ్ వెళ్లింది. అక్కడ గుండెపోటు రావడంతో తెలిసిన వాళ్లు ఆమెను హాస్పిటల్‌లో చేర్చి, క్యాజిల్‌రాక్‌లో ఉన్న చేపలమ్మాయికి కబురుపెట్టారు. కబురు అందిన సమయానికి లింక్ ఎక్స్‌ప్రెస్ వెళ్లిపోవడంతో, గౌరీశంకరం పనిచేసిన గూడ్సు ట్రెయిన్ బ్రేక్ వ్యాన్‌లో అమ్మాయి ప్రయాణించి మడ్‌గామ్‌లో తల్లికి సేవలు చేసి, తేరుకున్న తరువాత తిరిగి క్యాజిల్ రాక్‌కి తీసుకొచ్చింది. ఆ ఉపకారాన్ని గుర్తుంచుకొని చేపలమ్మాయి జూలీ మిరాండో మౌనంగానూ, ఆమె తల్లి రెన్నీ మిరాండో మాటల్లోనూ గౌరీశంకరానికి కృతజ్ఞతలు చెప్పారు.

''రెన్నీ మిరాండోకి తెలుగు వచ్చా?'' ఆశ్చర్యపోయిన గౌరీశంకరంతో ఏఎస్ఎమ్ నాయర్-''ఆc..లోకోషెడ్‌లో మెకానిక్ అచ్చయ్య కొన్నాళ్ల పాటు ఆవిణ్ణి ఉంచుకున్నాడు లే'' అన్నాడు. అదేం పెద్ద విశేషం కాదన్నట్లుగా.. క్యాజిల్‌రాక్‌లోని జనం దృష్టిలో తల్లి కూతుళ్ల స్థాయి ఎలాంటిదైనా గౌరీశంకరానికి మాత్రం చేపలమ్మాయి కళ్లు గుర్తొచ్చినప్పుడల్లా వాటిల్లో కొవ్వొత్తుల వెలుగులో ప్రశాంతతే కనిపిస్తున్నాయి. ముప్ఫై అయిదేళ్ల సర్వీసు చేసి, మెయిల్ గార్డుగా రిటైర్ అయిన తరువాత కూడా చేపలమ్మాయి మూగదన్న సంగతి గౌరీశంకరానికి తెలీదు.

*